క్లుప్తంగా

పాదయాత్రను జయప్రదం చేయండి..



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేయడాన్ని నిరసిస్తూ గ్రామ పంచాయతీ సిబ్బంది చేపట్టే పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న పిలుపునిచ్చారు. శుక్రవారం పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తెచ్చిందని, వీటిని రద్దు చేసి కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న హైదరాబాద్ ఇందిరాపార్కుకి చేరే పాదయాత్రలో కార్మికులు పాల్గొనాలని కోరారు.

దయాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు హాజరై దయాకర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బ్రదర్ అనిల్‌కుమార్..



కేక్ కట్ చేస్తున్న సుధీర్‌బాబు

ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం వైఎస్ షర్మిల భర్త బ్రదర్ అనిల్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆలస్యం రవి, రాంబాబునాయక్, పి.రాఘవ, బి.వీరునాయక్, సత్యనారాయణ, వీరేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామానికి చెందిన శీలం సంగయ్య (70) తన భార్యతో నివసిస్తుండగా, కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన భార్యను డబ్బు కోసం ఒత్తిడి చేశాడు. అయితే, భార్య డబ్బు ఇవ్వకపోవడంతో గురువారం గడ్డి మందు తాగిన ఆయనను కాసేపటికి గుర్తించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రైటర్ పద్మభూషణ్
వినోద	వసంత కోకిల
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	పఠాన్
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	అమిగోస్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	66	పాలకూర	3
పచ్చిమిర్చి	24		20
కాకర	36	చుక్కకూర	2
బీర	56		10
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	76	గోంగూర	2
గోరుచిక్కుడు	40		10
క్యాబేజీ	14	మెంతికూర	5
క్యాలీఫ్లవర్	20		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	64		20
క్యారెట్	24	పుదీన	1
క్యాప్సికం	40		20

-ఖమ్మం వ్యవసాయం

ప్రమాదాల బారిన పడుతూ..

- డేంజర్ జోన్‌గా ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారి
- ఇటీవలి కాలంలో వరుస ప్రమాదాలు
- నలుగురు మృత్యువాత.. గాయపడిన పలువురు

రఘునాథపాలెం: ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రోడ్డు మార్గంలోని రఘునాథపాలెం మండలం శివాయిగూడెం నుంచి బూడిదంపాడు మధ్య ప్రాంతం ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. ఈ రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధానంగా ఇల్లెందు పట్టణంతో వివిధ రకాల అనుబంధం కలిగిన జిల్లావాసులు రాకపోకలు సాగించడంతోపాటు బొగ్గు రవాణా వాహనాలు వచ్చివెళ్తుంటాయి. ఇక జిల్లాలోని కామేపల్లి మండలం పండితాపురంలో సంత జరిగే రోజున ఈ రహదారి బిజీగా ఉంటుంది. ఈ క్రమంలో మూలమలుపులు, రోడ్డు మార్జిన్ సరిగ్గా లేని కారణంగా ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. నెల రోజుల్లో జరిగిన ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడగా పలువురు గాయాల పాలై మంచం పట్టారు.

రెండు వరుసల రోడ్డు ఉన్నా..

ఖమ్మం నుంచి ఇల్లెందు వరకు రెండు వరుసల రహదారి ఉన్నా.. ఇరువైపులా మార్జిన్ సరిగ్గా లేదు. ఇక పలుచోట్ల గుంతలు, బూడిదంపాడు – మంచుకొండ మధ్య చెరువు సమీపాన మలుపు ఉండటంతో ప్రమాదాలకు కారణంగా మారింది. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్రవాహనదారులు కిందకు దిగుదామన్నా అవకాశం లేకుండా ఉంటోంది. ఈ ఎగుడుదిగుడు పరిస్థితుల కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికి తోడు రోడ్డు ఎత్తుపల్లాలుగా ఉండటంతో రాత్రి వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కూడా కనిపించడం లేదు. అలాగే, వాహనదారుల అతి వేగం కూడా ప్రమాదాలకు కారణమవుతోందని పోలీసులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్‌ల వద్ద మట్టి నింపించి చదును చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, రేడియం స్టిక్కర్లతో సూచికలు ఏర్పాటు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



ఇటీవల ప్రమాదం జరిగిన స్థలంలో బైక్, టిప్పర్



రహదారి మధ్యలో ఉన్న మూలమలుపు



సైడ్‌బర్మ్‌లు లేకుండా ఉన్న రోడ్డు

తరచుగా ప్రమాదాలు



నిత్యం ఈ రోడ్డుపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మా కళ్ల ముందే ఎందరో ప్రమాదాల బారిన పడ్డారు. ప్రధానంగా మార్జిన్ రోడ్డు సక్రమంగా లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది. అలాగే, మలుపులు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

–భూక్యా అజయ్‌కుమార్, మంచుకొండ

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి..



నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై ప్రమాదాల స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. ఇక రాత్రి వేళ వచ్చివెళ్లే వాహనదారులు అప్రమత్తంగా ఉంటే మంచిది.

–బి.ఉదయ్‌కుమార్, మంచుకొండ

ఇటీవల ప్రమాదాలు పెరిగాయి..



రద్దీగా ఉండే ఈ రహదారిపై ప్రమాద స్పాట్లను గుర్తించి వేగ నియంత్రణ కోసం డ్రమ్ములు ఏర్పాటు చేశాం. అలాగే, వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నాం. కొందరు వాహనదారుల నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.

–ఎం.రవి, ఎస్‌ఐ, రఘునాథపాలెం

మధుకాన్ ఫ్యాక్టరీని సందర్శించిన ఎంపీ నామా

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం వద్ద ఉన్న మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్‌ను శుక్రవారం ఖమ్మం ఎంపీ, మధుకాన్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ నామా నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ అంతా కలియదిరిగిన ఆయన నూతనంగా నిర్మిస్తున్న గ్యాస్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం సంస్థ ఉద్యోగులు, కార్మికులతోపాటు అక్కడకు వచ్చిన రైతులతో చర్చించారు. ఎంపీ వెంట మధుకాన్ సీజీఎం కోటయ్య తదితరులు ఉన్నట్లు తెలిసింది.

వైస్‌చైర్మన్‌కు ఎంపీ రవిచంద్ర అభినందన



అఫ్జల్‌ను సత్కరిస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులై బాధ్యతలు చేపట్టిన షేక్ అఫ్జల్ శుక్రవారం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అఫ్జల్‌ను ఎంపీ అభినందించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



వాసిరెడ్డి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిరుమలాయపాలెం: విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటర్ దశ కీలకమైనందున విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తే భవిష్యత్ మెరుగ్గా ఉంటుందని తెలిపారు. అనంతరం క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయగా, విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గ్రామ సర్పంచ్ రాయల నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చామకూరి రాజుతో పాటు రాయల ఈశ్వరి, నారాయణరావు, నర్సింహారావు, రామయ్య, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవండి..

నేలకొండపల్లి: ప్రతీ ఒక్క విద్యార్థి పట్టుదలతో చదివి.. ఉన్నతస్థానాలకు ఎదగాలని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎన్ శాస్త్రి సూచించారు. మండల కేంద్రంలోని కళాశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆర్.ఆమోస్, భరత్, సత్యనారాయణరెడ్డి, గురవయ్య, సూర్యప్రకాష్, రమాదేవి, ప్రమోద్, భాస్కర్, తిలక్, ప్రియాంక, కల్యాణి, అరుణ, నాగశ్రీ, దుద్దెల రవికుమార్, శివ, బాలకృష్ణ, లక్ష్మణ్, పాషా, లక్ష్మి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: దేవాదాయ శాఖ ఉద్యోగి సమతను వేధించి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన బీఆర్ఎస్ నాయకుడు బెల్లం వేణుపై చర్యలు తీసుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేణుపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో గుంతేటి వీరభద్రం, వెంకటరమణ, రెహమాన్, భద్రూనాయక్, పద్మాచారి, సంజీవరావు, శ్రీనివాస్, మస్తాన్, శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, గాదరి బాబు, ఉపేంద్ర నాయక్, రమ్య, జంగిపల్లి రవి పాల్గొన్నారు.

గాయపడిన యువతికి 'తానా' చేయూత



శ్రీలిఖిత (ఫైల్)

ఖమ్మంసహకారనగర్: నగరానికి చెందిన పిన్నం శ్రీలిఖిత అమెరికాలో ఎమ్మెస్ చదువుతూ గత నెల 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లింది. దీంతో ఖమ్మం బైపాస్‌రోడ్డులో నివసిస్తున్న ఆమె తల్లిదండ్రులు రమేశ్ – రమాదేవి ఇచ్చిన సమాచారంతో ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు తానా బాధ్యులు తాళ్లూరి జయశేఖర్‌కు విషయాన్ని తెలిపారు. దీంతో తానా బాధ్యులు సామినేని రవి, ఎమ్మెల్సీ తాతా మధుతో పాటు యూఎస్‌ఏలో ఉంటున్న కొల్లా అశోక్ ఆధ్వర్యాన ఫండ్ రైజింగ్ చేపట్టారు. శ్రీలిఖిత చికిత్సకు కావాల్సిన నగదును సేకరిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఎన్నారై పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేదరమెట్ల స్వరూపారాణి, కానూరి హిమబిందు తదితరులు శుక్రవారం రమేశ్ దంపతులను ఖమ్మంలో పరామర్శించారు.

ప్రతిభను వెలికి తీసేందుకే టాలెంట్ టెస్ట్

ఖమ్మంమయూరిసెంటర్: పదో తరగతి విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఏటా టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. ఖమ్మం సుందరయ్యభవనంలో శుక్రవారం ఆయన టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతూనే, విద్యార్థులను ప్రోత్సహించేందుకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు టాలెంట్ టెస్ట్ జరుగుతుందని చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌తో పాటు ప్రేమ్‌కుమార్, సంగీత, తరుణ్, సతీశ్, వెంకటేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న కూరాకుల నాగభూషణం

శివరామ్ మృతికి సంతాపం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని గట్టయ్యసెంటర్‌కు చెందిన ఉపాధ్యాయుడు అమరబోయిన శివరామ్ మృతికి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం సంతాపం తెలిపారు. శుక్రవారం శివరామ్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

13న రహదారులను దిగ్బంధిస్తాం..

నేలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఈనెల 13న జిల్లాలోని జాతీయ రహదారులను దిగ్బంధిస్తామని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కోకన్వీనర్ వంగూరి ఆనందరావు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని ఆరోపించారు. మాదిగలను వంచన చేసిన బీజేపీని తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాట్టపింజర బాలస్వామి, వడ్లమూడి వెంకటేశ్వర్లు, కుక్కల రవీందర్, మాతంగి ఉపేందర్, విజయ్, వెంకట్రావు, నాగేంద్రబాబు, నవీన్, వంగూరి శ్రీను, దాసు, లింగయ్య, గోపీనాథ్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాలను పరిశీలించిన ఏఓ



వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ వాణి

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంలో అగ్గి తెగులు సోకిన పలు వరి పొలాలను శుక్రవారం ఏఓ వాణి పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి తగు సలహాలు, సూచనలు అందించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో అగ్గి తెగులు వ్యాప్తి జరుగుతోందని, దీనిని మొదటి దశలోనే నియంత్రించకపోతే తదుపరి దశలో మెడవిరుపు తెగులు సోకి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుందని ఏఓ వివరించారు. ఈ సందర్భంగా తెగుళ్ల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, వాడాల్సిన పురుగుమందులపై అవగాహన కల్పించారు.

ప్రభుత్వ స్థలాల్లో గిరిజనుల గుడిసెలు



గిరిజనులతో చర్చిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం గ్రామంలో గిరిజనులు 70 మందికి పైగా ప్రభుత్వ స్థలంలో శుక్రవారం గుడిసెలు వేసుకున్నారు. 22 ఏళ్ల నుంచి గూడు లేక ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు ఉంటున్నందున పట్టాలు ఇచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టంచేశారు. గ్రామ రెవెన్యూ సహాయకులు చేరుకుని గుడిసెల తొలగింపునకు యత్నించగా వారు అడ్డుకున్నారు. అనంతరం తహసీల్దార్ దారా ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధవి వచ్చి చర్చించారు. జిల్లా అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించిన గిరిజనులు, స్పష్టమైన హామీ వచ్చే వరకు గుడిసెలు తొలగించేది లేదని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంబాయితో పాటు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఆయా సబ్‌స్టేషన్ల అసిస్టెంట్ ఇంజనీర్లు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

- నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్ 33 కేవీ సబ్‌స్టేషన్.. బైపాస్‌రోడ్ 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు నరికే కార్యక్రమం ఉన్నందున బైపాస్‌రోడ్, విజయ్‌నగర్‌కాలనీ, వికలాంగులకాలనీ, వేణుగోపాల్‌నగర్‌లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ తావుర్యా తెలిపారు.
- మామిళ్లగూడెం 11 కేవీ ఫీడర్ పరిధిలో మామిళ్లగూడెం, విశ్వ ఆస్పత్రి ప్రాంతంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్–2 ఏఈ నాగేశ్వరరావు తెలిపారు.
- ఎన్ఎస్‌టీ 11 కేవీ ఫీడర్ పరిధిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంరోడ్, బాలాజీనగర్, అంకుర వైద్యశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరావు తెలిపారు.
- ప్రభుత్వ ఆస్పత్రి సబ్‌స్టేషన్ పరిధిలో ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతం, జెడ్పీసెంటర్, జమ్మిబండ, నిజాంపేట, మోమినాన్, తుమ్మలగడ్డ, ఆదిత్య థియేటర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఖమ్మంఅర్బన్ మండలంలో..

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లి పారిశ్రామిక ప్రాంత సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మరమ్మతులు నిర్వహిస్తున్నామని, దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని జయనగర్‌కాలనీ, బల్లేపల్లి, బాలాపేట, పాండురంగాపురం, అమరావతినగర్, విద్యానగర్, కైకొండాయిగూడెం, గణేశ్ టౌన్‌షిప్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీఆర్ఎస్‌ను గద్దె దించాలి



మాట్లాడుతున్న రాజవర్ధన్‌రెడ్డి

తిరుమలాయపాలెం: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దళితులు, రైతులు, పేదలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ పిలుపులో భాగంగా శుక్రవారం మండలంలోని రఘునాథపాలెంలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగిస్తుందని, కార్యకర్తలు ఆ దిశగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు గుండా శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి నున్నా రవి, పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్‌రెడ్డి మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి ప్రసాద్, నాయకులు భద్రయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు.

'బిల్లు' నాణ్యత లేదు..

- ఎంతో కాలం నిలవని బిల్లింగ్ వివరాలు
- నూతన బిల్లింగ్ విధానం తెచ్చిన తంటా

ఖమ్మంవ్యవసాయం: కరెంటు బిల్లు పేపరు విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. నూతనంగా అమలు చేస్తున్న బిల్లింగ్ విధానంలో గతంలో మాదిరిగా ఉన్న పూర్తి సమాచారం లేకుండా పోయింది. బిల్లుపై ఉన్న ప్రింటింగ్ కూడా ఎక్కువ కాలం ఉండకుండా పోతోంది. దీంతో వినియోగదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. పెరిగిన సాంకేతిక విధానాన్ని విద్యుత్ సంస్థ అందిపుచ్చుకొని కొత్త బిల్లింగ్ విధానాన్ని అమలు చేస్తోంది. ఆండ్రాయిడ్(మొబైల్) ఫోన్ ద్వారా మీటరు రీడింగ్ విధానాన్ని నూతనంగా విదుత్ సంస్థ అమలు చేస్తోంది. ఈ విధానం ద్వారా బిల్లింగ్ సమయాన్ని ఆదా చేసే అవకాశం ఉంది. అయితే ఈ విధానంలో వినియోగదారులు కొంత ఇబ్బందులు పడక తప్పటం లేదు. గతంలో స్పాట్ బిల్లింగ్ మిషన్ల ద్వారా మీటరు రీడింగ్‌లను తీసేవారు. ఈ బిల్లులకు ఓ వైపు పింక్ (గులాబీ) కలర్‌లో కేటగిరీల వారీగా యూనిట్లకు వచ్చే బిల్లుల వివరాలు, కనీస చార్జీల వివరాలు, మీటరు స్థితి, పలు సూచనలు తదితర వినియోగదారులకు ఉపయోగపడే అంశాలు ఉండేవి. మరో వైపు బిల్లు వివరాలు ఎన్ని యూనిట్లు వినియోగించారు? అందుకు చెల్లించాల్సిన బిల్లు, బిల్లు చివరి తేదీ తదితర వివరాలు నీలం రంగులో ఉండేవి. బిల్లింగ్ విధానాన్ని ఆండ్రాయిడ్ పద్ధతిలోకి మార్చిన తరువాత అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. పింక్ కలర్‌లో ఓ వైపు ఉన్న వివరాలు పూర్తిగా లేకుండా పోయాయి. ఆ వైపు పూర్తిగా ఖాళీగా ఉంటోంది. ఇక మరో వైపు మాత్రం గతంలో మాదిరిగా ఉన్న వివరాలు ఉంటున్నాయి. అయితే ప్రింటింగ్‌లో మాత్రం తేడా ఉంది. ఈ ప్రింట్‌ను సాంకేతికంగా థర్మల్ ప్రింటింగ్ అంటారు. ఈ ప్రింటింగ్ ఎక్కువ కాలం మన్నికగా ఉండదు. కాలం గడిచినా కొద్దీ ప్రింట్ కనుమరగవుతుంది. ప్రింట్ నాణ్యతలో కూడా తేడా ఉంది. పేపరుకు వేడి తగిలినా, వత్తుకున్నా ప్రింటింగ్ నల్లగా మారుతుంది. ప్రింట్‌లో కూడా మార్పు చోటు చేసుకుంటుంది. ఒకటి, రెండు నెలలు బిల్లులు చెల్లించకపోతే ఆ బిల్లుల్లో వివరాలు కూడా కనుమరగవుతున్నాయి. దీంతో వివిధ వర్గాలకు చెందిన వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు చెందిన వారు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగిన సందర్భాల్లో ఆండ్రాయిడ్ బిల్లుల ప్రింటింగ్ సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వినియోగదారులు ఈ విషయాన్ని విద్యుత్ సంస్థ అధికారుల దృష్టికి తీసుకుపోయారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు. కొందరు గృహ వినియోగదారులు తాము వినియోగించిన విద్యుత్ యూనిట్లకు తగిన విధంగా చార్జీలు విధించారా..? లేదా అనే అంశాలు లేకుండా బిల్లులు ఇస్తున్నారని చెబుతున్నారు. గతంలో మాదిరిగా పూర్తి వివరాలు, శాశ్వతంగా భద్రపర్చుకునే విధంగా విద్యుత్ బిల్లు పేపర్లు ఉండేవి ఇవ్వాలని కోరుతున్నారు.

థర్మల్ ప్రింటింగ్ విధానం అమలు

ఆండ్రాయిడ్ బిల్లింగ్ విధానంలో థర్మల్ ప్రింటింగ్ విధానాన్ని సంస్థ అమలు చేస్తోంది. ఓ వైపు మాత్రమే బిల్లు వివరాల ప్రింటింగ్ ఉంటుంది. థర్మల్ ప్రింటింగ్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్ విధానం ఇంకా రాలేదు. వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. అవసరమైతే ప్రింట్ తీసుకోవచ్చు. ఎక్కువ రోజులు బిల్లుపై ఉన్న ప్రింట్ నిలవని విషయం వాస్తవమే.

–శ్రీధర్, ఎస్ఏఓ, ఖమ్మం